ప్రజాశక్తి
శనివారం 29 నవంబరు 2025
5
శ్రీకాకుళం

'పది' ఫీజు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించడానికి గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించడానికి డిసెంబరు ఆరో తేదీ వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబరు 7 నుంచి 9 వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబరు 10 నుంచి 12 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 13 నుండి 15వ తేదీ వరకు చెల్లించాలని వివరించారు. ప్రధానోపాధ్యాయులు https://bse.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ స్కూల్ లాగిన్‌లో లాగిన్ అయి విద్యార్థి వివరాలు ధ్రువీకరణ చేసి ఫీజు చెల్లించాలని తెలిపారు.

దొడ్డిదారిన ధాన్యం కొనుగోలు!

- కేంద్రాలతో నిమిత్తం లేకుండా రైతుల నుంచి నేరుగా కొనుగోలు
- నెల రోజుల కిందట నుంచే మొదలైన తతంగం
- నిద్రావస్థలో అధికార యంత్రాంగం
- సారవకోట, జలుమూరులో వెలుగుచూసిన మిల్లర్ల అక్రమాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బుడితి మిల్లులో ధాన్యం నిల్వలపై ప్రశ్నిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ధాన్యం కొనుగోలు విషయంలో ఈసారి కొంతమంది మిల్లర్లు కొత్త దారులు వెతుక్కున్నారు. తూకంలో అదనంగా ధాన్యం తీసుకోవడం, మద్దతు ధర కంటే తక్కువ రేటు చెల్లించడం వంటి పద్ధతులకు స్వస్తి చెప్పి అనధికారికంగా కొనుగోలుకు తెర తీశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరవకముందే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేశారు. సారవకోట, జలుమూరు మండలాల్లో కొనసాగుతున్న ఈ వ్యవహారంపై కొందరు మిల్లర్లు ఫిర్యాదు చేయడంతో బట్టబయలైంది. రెండు మండలాల్లో కలిపి సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అనధికారికంగా కొనుగోలు చేసినట్లు సమాచారం. వీరెవరూ బ్యాంకు గ్యారంటీ (బిజి)లు సమర్పించలేదని తెలుస్తోంది. వారం రోజుల కిందట బిజిల ప్రక్రియ మొదలైన తర్వాత ఇప్పటికీ ఆ రెండు మండలాల్లో పూర్తిగా బిజిలు చెల్లించలేదు. సారవకోటలో 15 మిల్లులు ఉండగా, ఇప్పటివరకు 11 మంది మిల్లర్లు బిజిలు చెల్లించారు. జలుమూరు మండలంలో ఆరు మిల్లులు ఉండగా, ముగ్గురు బిజిలు చెల్లించారు. అయితే బిజిలు ఇవ్వకముందే ధాన్యం కొనుగోలు చక్కబెట్టినట్టు తెలిసింది. ఆ రెండు మండలాల్లో అక్టోబర్ చివరి వారంలోనే పంట చేతికొచ్చేయడంతో రైతుల నుంచి అనధికారికంగా కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలన్న చందంగా ఉంది జిల్లాలో ధాన్యం కొనుగోలు పరిస్థితి. ధాన్యం కొనుగోలులో అవకతవకలను నియంత్రించడానికి ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొస్తుంటే, అందుకు విరుగుడుగా కొంతమంది మిల్లర్లు సరికొత్త అక్రమ మార్గాలను వెతుక్కుంటున్నారు. కాసులకు కక్కుర్తిపడి అడ్డదారులు తొక్కుతున్నారు. తాజాగా సారవకోట, జలుమూరు మండలాల్లో వెలుగు చూసిన అవకతవకలు ఇందుకు ఉదాహరణగా ఉన్నాయి. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రారంభానికి నెల రోజుల ముందే కొంతమంది మిల్లర్లు రైతుల నుంచి పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేశారు. అధికార యంత్రాంగం నిద్రావస్థలో ఉండడంతో మిల్లర్లు యథేచ్ఛగా తమ పని కానిచ్చేస్తున్నారు. మిల్లర్ల మధ్య పోరుతో ఫిర్యాదులు అందడంతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం రంగం లోకి దిగి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

కాసుల కక్కుర్తి కోసమేనా?

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకముందే ధాన్యం కొనుగోలు చేయడం, కొంతమంది మిల్లర ధన దాహమే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం కొంటే రైతులకు బస్తాకు (80 కేజీలు) సాధారణ రకానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం రూ.1895 చెల్లించాల్సి ఉంటుంది. రైతుల నుంచి మాత్రం ఒక్కో చోట ఒక్కో రేటు చెల్లించి ధాన్యం తీసుకున్నట్లు తెలిసింది. కనిష్టంగా రూ.1300 నుంచి గరిష్టంగా రూ.1400 చెల్లించినట్లు సమాచారం.

అదీగాక కొనుగోలు కేంద్రం ద్వారా తీసుకున్న ధాన్యం కచ్చితంగా 80 కేజీలు మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. తమకు గిట్టుబాటు కావడం లేదంటూ అదనంగా నాలుగు నుంచి ఐదు కేజీల వరకు అదనంగా ధాన్యం తీసుకుంటున్న పరిస్థితి ప్రతి ఖరీఫ్‌లో జరుగుతుందే. దానిపై అధికారులు మిల్లర్లకు గట్టిగా హెచ్చరించడం వంటి సమస్యలూ ఉన్నాయి. వీటి నుంచి బయట పడేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్టుగా తెలుస్తోంది. మరోవైపు ధాన్యం మర ఆడించేందుకు మిల్లులకు అధికారులు కొంతమేర లక్ష్యం నిర్ణయించారు. ఆ ధాన్యంతో పాటు వీరు అనధికారికంగా కొనుగోలు చేసిన ధాన్యంతో మరింత లాభాలు గడించవచ్చన్న ఆశతోనే కొంతమంది మిల్లర్లు కక్కుర్తి పడ్డారన్న చర్చ నడుస్తోంది.

అధికారులు ఏం చర్యలు తీసుకోనున్నారో?

ధాన్యం కొనుగోలులో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఫిర్యాదులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ రంగంలోకి దిగారు. సారవకోట మండలం బుడితి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహశీల్దార్ విజయలక్ష్మి, సిఎస్‌డిటి షరీఫ్‌ను ధాన్యం సేకరణపై పలు ప్రశ్నలు వేశారు. తర్వాత అక్కడే ఉన్న భవాని మోడరన్ రైస్ మిల్లును తనిఖీ చేశారు. అక్కడ స్టాక్ రిజిస్టర్, ధాన్యం సేకరణ తీరును పరిశీలించారు. ట్రక్‌షీట్లు, ఎఫ్‌టిఒ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యవహారం బయటపడడంతో మిల్లర్ల పెద్ద ఒకరు అవకతవకలకు పాల్పడిన మిల్లర్లను రక్షించేందుకు తెరచాటు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన కీలక నేత అనుంగ అనుచరునిగా ఉన్న ఆ మిల్లర్ల నాయకుడు మాటను కాదని అధికారులు ఏవిధంగా ముందుకు వెళ్లనున్నారో చూడాల్సి ఉంది. అక్రమ పద్ధతిలో ధాన్యం కొనుగోలు సాగించిన వ్యవహారంలో ఇప్పటివరకు ఎవరిపైనా చర్యలు తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించలేదు. మరోవైపు దొడ్డిదారిన ధాన్యం కొనుగోలు చేసిన మిల్లుల సీజ్‌పైనా ఎటువంటి నిర్ణయం వెలువరించలేదు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతారా? అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలకు ఉపక్రమిస్తారా? చూడాల్సి ఉంది.

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

'సప్తాహ సూర్య పర్వం'గా రథసప్తమి

- ఏడు రోజుల మహోత్సవానికి పకడ్బందీ ప్రణాళిక
- సత్వర దర్శనమే లక్ష్యం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అరసవల్లి రథసప్తమి మహోత్సవాన్ని ఈసారి ఏడు రోజుల పాటు (జనవరి 19 నుంచి 25 వరకు) 'సప్తాహ సూర్య మహోత్సవం'గా అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏడు రోజుల పాటు ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది, ప్రతిరోజూ ఒక ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించాలని, ఇందుకోసం ప్రధాన అర్చకులతో సంప్రదించాలని సూచించారు. యాత్రికులకు సత్వర దర్శనమే లక్ష్యమన్నారు. క్యూలైన్లపై ఒత్తిడి తగ్గించేందుకు ఆన్‌లైన్ టికెట్లను క్యూఆర్ కోడ్‌తో అందుబాటులోకి తెచ్చి, భక్తుల రద్దీని ఏడు రోజులకు విస్తరించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప రాష్ట్రపతి ఏదో ఒక రోజు ఉత్సవానికి హాజరయ్యే అవకాశం ఉన్నందున, అందుకు తగ్గట్టుగా ప్రోటోకాల్, భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రత, సౌకర్యాల విషయంలో రాజీ పడొద్దన్నారు. ఆలయం, కొత్త సాంస్కృతిక మైదానం, నగరం మొత్తం సిసి కెమెరాల నిఘాలో ఉండేలా పర్యవేక్షణ పెంచాలని కలెక్టర్ సూచించారు. నిష్క్రమణ పాయింట్ వద్ద భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదాలను అందించడంతో పాటు కోవా వంటి నాణ్యమైన వైవిధ్య ప్రసాదాల పంపిణీపై దృష్టిసారించాలన్నారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆహ్వాన పత్రాలు పంపాలని అధికారులు తీర్మానించారు.

ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ, ఏడు రోజులు ఉత్సవాలు నిర్వహించడం ద్వారా జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని తెలిపారు. ఉత్సవాల ప్రారంభం రోజున సూర్య నమస్కారాలు, శోభాయాత్రతో పాటు ఏడు రోజుల పాటు రాష్ట్రస్థాయి ఆటల పోటీలను నిర్వహించాలని ప్రతిపాదించారు. కార్పొరేషన్ అధికారులు నగరాన్ని, ముఖ్యంగా జాతీయ రహదారిపై నుంచి అరసవల్లికి వచ్చే దారులను శాశ్వత ప్రాతిపదికన సుందరీకరించడానికి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి బందోబస్తుపై మాట్లాడారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, ఆర్‌డిఒలు సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, గణేష్, డిఎస్‌పి వివేకానంద, అరసవల్లి ఇఒ ప్రసాదరావు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టెక్కలి డివిజన్‌కు నందిగాం

అభ్యంతరాలుంటే తెలపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా పరిపాలనా సౌలభ్యం కోసం నందిగాం మండలాన్ని ప్రస్తుతం ఉన్న పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి రెవెన్యూ డివిజన్‌కు మారుస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రాథమిక నోటిఫికేషన్ (జిఒ ఆర్‌టి 1490) జారీ చేశారు. ఈ ప్రతిపాదనపై ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే గెజిట్ ప్రచురణ అయిన తేదీ (27.11.2025) నుంచి 30 రోజుల్లోపు రాతపూర్వకంగా కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

త్వరితగతిన పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పాత, కొత్త సాగునీటి ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఆయకట్టులోని చివరి భూమి వరకూ నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జలవనరుల శాఖ అధికారులతో కలిసి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైడ్ వియర్ నుంచి ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా హిరమండలం రిజర్వాయర్‌కు నిరంతరాయంగా నీరు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. గొట్టాబ్యారేజీ ఆప్రాన్ కోసం అత్యవసరంగా అవసరమైన రూ.12 కోట్లు మంజూరు చేయించేందుకు ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు. గొట్టా ఎత్తిపోతల పథకం పూర్తయితే 12 టిఎంసిల నీరు హిరమండలం రిజర్వాయర్‌కు తరలించే కీలక ప్రాజెక్టుగా మారుతుందన్నారు.

వంశధార ఎడమ ప్రధాన కాలువ ఆధునీకరణకు రూ.1600 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. కాలువ సామర్థ్యం 2,480 క్యూసెక్కులు కాగా, ప్రస్తుతం 1800 క్యూసెక్కుల నీరు మాత్రమే అందుతోందని వివరించారు. 104 కిలోమీటర్ల మేర ఉన్న ఈ కాలువను తక్షణమే ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. 88వ ప్యాకేజీలో 90 శాతం పనులు పూర్తయినా భూసేకరణ జాప్యం, బిల్లులు (రూ.22 కోట్లు) చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, పనుల వేగాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో నాగావళి-వంశధార నదుల అనుసంధాన ప్రాజెక్టు తాజా పరిస్థితిని, అలాగే నాగావళి-వంశధార నదుల కరకట్టల పెండింగ్ పనులపై చర్చించారు. మడ్డువలస రిజర్వాయర్, సైరిగాం, కలింగదల్, ఓనిగెడ్డ ఇతర మైనర్ ఇరిగేషన్ అంశాలపై మంత్రి సమీక్షించారు.

నాగావళి డే నైట్ వంతెన వద్ద డైక్ నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయిందని, కళింగపట్నం, పి.జి పేట సమస్యను ఎమ్మెల్యే గొండు శంకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర షట్టర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్ఇలు పొన్నాడ సుధాకరరావు, గురుగుబెల్లి రామచంద్రరావుతో పాటు ఆ శాఖ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధి లక్ష్యం

శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి లక్ష్యమని శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి అంచనాలను కమిటీ శుక్రవారం సమీక్షించింది. సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శాఖ ప్రగతిని వివరించారు. బిసి హాస్టల్స్‌కు వార్డెన్లు ఉన్నారా? అని కమిటీ సభ్యులు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రశ్నించారు. కొన్ని ఖాళీ అయితే సమీపంలోని హాస్టల్స్‌కు ఒక్కో ఇన్‌ఛార్జిని వేసినట్లు బిసి సంక్షేమ అధికారి అనురాధ తెలిపారు. బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ అమలు చేస్తున్న పథకాలపై కమిటీకి వివరించారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నాయ్ దొర జిల్లాలోని గిరిజన హాస్టల్స్ గురించి వివరించారు. రెండు రోజుల్లో హాస్టల్స్‌పై రిపోర్ట్ అందజేయాలని కమిటీ సభ్యులు ఆదేశించారు. రెండు జిల్లాలకు ఒక ఐటిడిఎ కావడంతో సమీక్ష సరిగా జరగడం లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ గ్రామీణాభివృద్ధి శాఖలో అమలు చేస్తున్న పథకాలను కమిటీకి వివరించారు. ఐసిడిఎస్ పీడీ ఐ.విమల ఆ శాఖలో అమలు చేస్తున్న పోషకాహారం, పిల్లలకు విద్య, మిషన్ వాత్సల్య తదితర వాటిని వివరించారు. జల జీవన్ మిషన్ కింద పాతపట్నం, శ్రీకాకుళం, టెక్కలి నియోజకవర్గంలో కొన్ని పనులు రద్దయ్యాయని, వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కోరారు. వైద్యారోగ్య శాఖలో పలు రకాల చికిత్సలు, తదితర వాటిపై డిఎంహెచ్ఒ కె.అనిత వివరించారు. పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, 104, 108 వాహనాలు వంటి వాటిపై కమిటీ సభ్యులు పలు ప్రశ్నలు వేశారు. ఉపాధి హామీపై డ్వామా పీడీ సుధాకరరావు వివరించారు. ప్రైవేట్ పాఠశాలల బస్సులపై దృష్టిసారించాలని డిఇఒ రవిబాబుకు కమిటీ సభ్యులు సూచించారు. ధాన్యం సేకరణపై జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు కమిటీ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ప్రభుత్వానికి నివేదించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్, డిఆర్‌ఒ లక్ష్మణమూర్తి, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, సిపిఒ లక్ష్మీప్రసన్న పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కిడ్నీ వ్యాధుల పరిశోధనకు ఐసిఎంఆర్ ఆమోదం

ప్రజాశక్తి - పలాస

ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల మూలాలపై పరిశోధన చేపట్టేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) ఆమోదం తెలిపింది. మూడేళ్లలో ఈ పరిశోధన పూర్తి చేసేందుకు ఐసిఎంఆర్ రూ.6.2 కోట్లు గ్రాంటు రూపంలో మంజూరు చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. 18 ఏళ్లకు పైబడిన వారి నుంచి రక్త, మూత్ర నమూనాలు సేకరించి శాస్త్రీయ విధానంలో పరీక్షిస్తారని పేర్కొంది. దీంతో బాధితులకు ఒకటి, రెండేళ్లల్లో కిడ్నీ సమస్య ఏ స్థాయిలో వచ్చే అవకాశం ఉందో తెలుస్తుందని తెలిపింది. ఆర్‌ఎన్‌ఎ సీక్వెన్సింగ్ విధానంలో జన్యుపరమైన పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపింది. కిడ్నీ మహమ్మారిపై పరిశోధనల కోసం వడివడిగా అడుగులు పడుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా ముఖ్యంగా ఉద్దానం, మైదాన ప్రాంతంలో అక్కడక్కడా పట్టిపీడిస్తున్న కిడ్నీ మహమ్మారిపై గత ప్రభుత్వాలు ఎన్నో ప్రయత్నాలు చేసినా, నేటికీ ఎలాంటి కారణాలు కనిపెట్టలేకపోయారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం వీటిపై సమగ్ర పరిశోధనలు చేసి వీటి మూలాలను తెలుసుకుని వాటిపై తగిన చర్యలు తీసుకునేందుకు ప్రముఖ నెఫ్రాలజీ వైద్యులు రవిరాజు అధ్యక్షతన కమిటీని నియమించారు. డాక్టర్ రవిరాజు తన బృందంతో ఎమ్మెల్యే గౌతు శిరీషతో శుక్రవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పరిశోధనకు సంబంధించి తగిన కార్యాచరణతో ముందుకు వెళ్లడానికి, త్వరితగతిన నివేదికను ప్రభుత్వానికి అందజేసేందుకు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశోధన బృందానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. నమూనాలు సేకరించడానికి వచ్చినప్పుడు సహకరిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

వంశధార ఎత్తిపోతలకు రూ.176 కోట్లు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, అందులో భాగంగానే సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిసారించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వంశధార ప్రాజెక్టు రూపకల్పనలో నేరడి బ్యారేజీ అత్యంత కీలకమైందన్నారు. ఈ బ్యారేజీకి సాంకేతిక, న్యాయపరమైన అడ్డంకులు తొలగినా ఇంకా కొన్ని అవరోధాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రత్యామ్నాయంగా వంశధార రిజర్వాయర్ నింపడానికి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. 2023లో గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేసినా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో పూర్తి కాలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రూ.176 కోట్లు చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎత్తిపోతల పథకం ద్వారా గొట్టాబ్యారేజీ నుంచి 12 టిఎంసిల నీటిని వంశధార రిజర్వాయర్లలోకి పంపించి వరదల సమయాల్లో వృథా నీటిని జాగ్రత్త చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వంశధార కుడి కాలువకు సంబంధించి 2.4 కిలోమీటర్ల వద్ద ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మొదలయ్యాయన్నారు. రిజర్వాయర్ నిండితే వంశధార ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకూ రెండు పంటలకు నీటిని అందుబాటులో ఉంచి ఆయకట్టును స్థిరీకరించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్దానం తాగునీటి పథకానికి అవసరమైన నీరందడంతో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని స్పష్టం చేశారు.

ఉత్సాహంగా వికలాంగుల క్రీడా పోటీలు

శ్రీకాకుళం సిటీ : అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో వికలాంగుల క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను వికలాంగుల శాఖ ఇన్‌ఛార్జి ఎడి బి.శైలజ, డిఎస్‌డిఒ ఎ.మహేష్ జెండా ఊపి శుక్రవారం క్రీడలను ప్రారంభించారు. జూనియర్స్, సీనియర్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. అంధులకు వాకింగ్ తదుపరి రన్నింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం షార్ట్‌పుట్, జావిలింగ్‌త్రో, డిస్క్ త్రో తదితర ఆటలను కోచ్‌లు లోపింటి రాజశేఖర్, ఉమామహేశ్వరరావు, శ్రీను, సింహాచలం, హరికృష్ణ ఆడించారు. క్రీడా మైదానంలో మెడికల్, మంచినీటి సదుపాయంతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. పోటీల్లో విజేతలకు డిసెంబరు మూడో తేదీన వికలాంగుల దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

కళింగ కోమటి కార్పొరేషన్ అధ్యక్షునిగా గోవిందరాజులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్‌గా బోయిన గోవిందరాజులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే కళింగ కోమటి కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టర్లను నియమించింది. చైర్మన్ పదవి విషయంలో మొదట్నుంచీ టెక్కలి నియోజకవర్గానికి చెందిన గోవిందరాజులు పేరు బలంగా వినిపించింది. పార్టీకి ఆయన చేసిన సేవలను అధినాయకత్వం దృష్టికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీసుకెళ్లడంతో ఆయన నియామకం ఖరారైంది. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. సామాజిక తరగతి అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు.

CHANGE OF NAME

I, **KAVERI** ,D/O Boddu Dharma Raju, residing at Sinklaputtuga village,Haripuram post,Mandasa Mandal, Srikakulam District,Andhra Pradesh 532243, have changed my name to **BODDU KAVERI** with effect from 29-11-2025. Henceforth, I shall be known as **BODDU KAVERI** for all purposes.

CHANGE OF NAME

Boddu Dharma Raju S/O Boddu Bheemayya of my minor child **GOWTHAM** residing at Ambugam Bodduluru village, Haripuram post, Mandasa Mandal, Srikakulam District, Andhra Pradesh,532243,do here by declare that I have changed the name of my minor child to **BODDU GOWTHAM** with effect from 29-11-2025. Henceforth, my child shall be known as **BODDU GOWTHAM** for all purpose.

CHANGE OF NAME

I, **B. L.Vara Prasad,** S/o Boddu Dharma Raju, residing at A. Bodduluru Village, Haripuram Post, Mandasa Mandal, Srikakulam District, Andhra Pradesh 532243, have changed my name to **Boddu Laxmi Varaprasad** with effect from 29-11-2025. Henceforth, I shall be known as **Boddu Laxmi Varaprasad** for all purposes.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్ తదితరులు

రైతులు దళారుల బారిన పడొద్దు

ప్రజాశక్తి- లావేరు

ధాన్యం రైతులు దళారీల బారిన పడవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం పెద్దలింగాలవలసలో లావేరు పిఎసిఎస్ ఆధ్వర్యంలో రైతుసేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతేడాది మండలంలో 6440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఈ ఏడాది 9200 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. మండలంలో 9 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రణస్థలం ఎడిఎ వడ్డాది శ్రీనువాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, పిఎసిఎస్ అధ్యక్షుడు కూనపల్లి దామోదరరావు, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, లుకాలపు అప్పలనాయుడు, తహశీల్దార్ జిఎల్ఇ శ్రీనివాసరావు, ఎంపిడిఒ పి.వెంకటరాజు, సిఇఒ మీసాల సత్యనారాయణ, ఎఒ మహేష్ నాయుడు, ఎఇఒ బగాది ప్రమీల, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కృష్ణారావుకు డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

డాక్టరేట్‌తో కృష్ణారావు

టెక్కలి ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో బోధకునిగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ కృష్ణారావుకు రౌర్కెలాలోని బీజూ పట్నాయక్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ వచ్చింది. ఐఓటి ఆధారిత మేధోమయ స్మార్ట్ వ్యవస్థ ద్వారా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అనే అంశంపై విశ్లేషణాత్మక పరిశోధన నిర్వహించి ఈ బిరుదును అందుకున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ నేటి సాంకేతిక రంగంలో పరిశోధనలకు ఉన్న ప్రాధాన్యం అపారమైందని, విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడే పరిశోధనలు సమాజానికి కూడా ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. పరిశోధనారంగంలో కళాశాల ప్రతిష్టను మరింత అభివృద్ధి చేసినందుకు కృష్ణారావును అభినందించారు. కృష్ణారావును కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా డి.విజయ్‌కుమార్, విభాగ అధ్యాపకులు, ఇతర సిబ్బంది అభినందించారు.

కిట్లు అందజేస్తున్న బిగ్ హెల్ప్ ప్రతినిధులు

విద్యార్థులకు బిగ్ హెల్ప్ సాయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 15 మంది అనాథ, నిరుపేద, ప్రతిభావంత, క్రీడా నైపుణ్య విద్యార్థులకు బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ సంస్థ శుక్రవారం సహాయం అందించారు. ఆగస్టు నెలకు రూ.9 వేలు విలువైన స్టడీ మెటీరియల్, సెప్టెంబరు నెలకు రూ.6 వేలు విలువైన కాస్మెటిక్స్, అక్టోబర్ నెలకు రూ.8 వేలు విలువైన దుప్పట్లు, స్టేషనరీ తదితర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నౌపడ ప్రాజెక్ట్ చైర్మన్ సి.వి.రాజా, జోనల్ డైరెక్టర్ జయకృష్ణారెడ్డి, హెచ్ఎం ఎం.భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి ఏటా రూ.6 వేలు విలువైన సహాయం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే సమ్మటివ్-1లో ప్రతి తరగతిలో మొదటి 10 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు డిసెంబరు 5న గోల్డెన్ స్టార్ అవార్డులు అందజేస్తామని ప్రకటించారు. పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్ కోసం బిగ్‌హెల్ప్ చేస్తున్న సేవలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ అభినందించింది.

స్కిల్స్ బిల్డ్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం డిపార్ట్మెంట్ ఆఫ్ సిఎస్ఇ, ఎఐఎంఎల్ వారు ఐబిఎం స్కిల్స్ బిల్డ్ ట్రైనింగ్ ప్రోగ్రాంపై వర్కుషాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌కు మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌కు చెందిన దీపికా రెడ్డి, శశికాంత్‌లు రిసోర్స్ పర్సన్స్‌గా హాజరై ఎఐ టూల్స్, డేటా టైప్స్, డీప్ లెర్నింగ్ తదితర టాపిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు అడ్వాన్సడ్ టాపిక్స్‌లో మంచి పట్టు సాధించాలన్నారు. సిఎస్ఇ విభాగధిపతి వై.జగదీశ్ కుమార్ మాట్లాడుతు ఈ వర్క్‌షాప్ విద్యార్థుల కోడింగ్ నైపుణ్యం పెంపొందించుకోవడానికి తోడ్పాడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ జి.టి.చంద్రశేఖర్, టిపిఒ డాక్టర్ బి.ప్రసాదరావు, రేవంత్ కుమార్, ఎం.సాయిసుధా, డాక్టర్ ఎస్.లక్ష్మణరాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వసంత కుమార్

స.హ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ ఉద్యోగులు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగినప్పుడే దరఖాస్తులకు సకాలంలో సమాచారం అందజేయగలరని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ వై.వి.శివకుమార్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆర్‌టిఐ చట్టంపై ఉద్యోగులకు శుక్రవారం అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు అయిన సందర్భంలో ఉద్యోగులకు అవగాహన కల్పించాలని నిర్ణయించామని చెప్పారు. పర్యావరణ సహాయ సంచాలకులు పి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమాచార హక్కు చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. టౌన్ ప్లానింగ్ ఎసిపి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చట్టం గురించి పూర్తి అవగాహన లేకపోవడం వల్ల తప్పులు జరుగుతున్నాయన్నారు. ఆర్‌టిఐ రిసోర్స్‌పర్సన్ కొమ్మాజోస్యుల వసంతకుమార్ స.హ చట్టం నిబంధనలు వివరించారు. సిబ్బంది అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మేనేజర్ టి.నాగరాజు, అన్ని విభాగాల పౌర సమాచార అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

బూర్జ: మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి- కవిటి

శారీరక దృఢత్వంతో పాటు నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించడానికి క్రీడలు అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. మండలం రాజపురం ఆదర్శ పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి అంతర్ పాఠశాల (గ్రిగ్స్) క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపాట శైలిలో ఆడే ఆటల నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడల వరకు విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలని సూచించారు. పాఠశాలల్లో క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం క్రీడాజ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, నాయకులు సీపాన వెంకటరమణ, బెందాలం రమేష్, బెందాలం తిరుమల కుమార్, పుల్లట సంతోష్, బెందాలం సురేష్, మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ, ప్రిన్సిపాల్ చింతాల గౌతమ్, ఎస్ఎంసి చైర్మన్ గంతి శ్రీను, క్రీడా ఉపాధ్యాయులు బల్లెడ రమేష్, నేతాజీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను, ప్రతిభను వెలికి తీసేందుకు ఆటల పోటీలు ఎంతగానో దోహద పడతాయని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి 76వ అంతర పాఠశాలల పోటీలకు (గ్రిగ్స్) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలురకు జరిగిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షెటిల్ బ్యాట్మెంట్ ఆటల పోటీల్లో పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీప, జెడ్‌పిటిసి రామారావు, వైస్ ఎంపిపి కరణం కృష్ణంనాయుడు, ఎంపిడిఒ తిరుపతిరావు, ఎస్ఐ ప్రవళ్లిక, ఎంఇఒ శ్యామలరావు, హెచ్ఎం లక్ష్మీనారాయణ, సర్పంచ్ వేగు అనురాధ, ఎంపిటిసి పోలినాయుడు, పిఇటిలు నారాయణరావు, మన్మధరావు, పోలినాయుడు, అప్పన్న, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలాస: ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరిగిన మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను హెచ్ఎం రవికుమార్ అధ్యక్షతన ప్రారంభించారు. జాతీయస్థాయి క్రీడాకారులు దాస్, రత్నాకర్, బి.రమేష్, పీడీ తవిటయ్య, పాఠశాల సిబ్బంది కార్యదర్శి పి.కృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్. పద్మలోచన, ఎస్.చంద్రశేఖర్, హరినాథ్, పిరవికాంత్, బి.శంకర్రావు, ఆర్.శ్రీనివాసరావు, గీత తదితరులు పాల్గొన్నారు. కబడ్డీ బాలురు సీనియర్ విభాగంలో మేధా, శ్రీ చైతన్య, జూనియర్ విభాగంలో

కవిటి : పోటీలను ప్రారంభిస్తున్న విప్ అశోక్

జిహెచ్ఎస్ పలాస, కాశీబుగ్గ, బాలికల సీనియర్ ఖోఖో విభాగంలో ఎంజెపి బ్రాహ్మణతర్ల, జూనియర్ విభాగంలో బ్రాహ్మణతర్ల ఎం జె పి పలాస గెలిచి జోనల్ మీట్‌కు ఎంపికైనట్లు పీడీ తెలిపారు.

నేటి నుంచి గ్రిగ్స్ పోటీలు

వజ్రపుకొత్తూరు: ఈ నెల 29 నుంచి నగరంపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మండలస్థాయి బాలురు, బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా ఎంపికలు జరుగుతాయని హెచ్ఎం టి. హేమరావు, వ్యాయమ ఉపాధ్యాయులు గజేంద్రరావు, నారాయణరావు తెలిపారు.

ముగిసిన గ్రిగ్స్ పోటీలు

పొందూరు: మండలం పిల్లలవలస జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం బస్వా గొల్లవాడు ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మొదటిరోజు బాలురకు, రెండో రోజు బాలికలకు నిర్వహించిన పోటీల్లో 300 మంది పాల్గొన్నారు. బాలికల సీనియర్ విభాగంలో కబడ్డీలో విన్నర్స్ తోలాపి జెడ్‌పిహెచ్ఎస్, రన్నర్స్ తాడివలస జెడ్‌పిహెచ్ఎస్ నిలిచాయి. ఖోఖోలో విన్నర్స్ లోలుగు జెడ్‌పిహెచ్ఎస్, రన్నర్స్ లోలుగు కెజిబివిలు నిలిచాయి. వాలీబాల్‌లో విన్నర్స్ లోలుగు కెజిబివి, రన్నర్స్ పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిలిచింది. బాడ్మింటన్‌లో విన్నర్స్ లోలుగు కెజిబివి, రన్నర్స్ పొందూరు జిహెచ్ఎస్‌లు గెలుపొందాయి. అలాగే జూనియర్ బాలికల కబడ్డీలో విన్నర్స్ లోలుగు కెజిబివి, రన్నర్స్ తాడివలస జెడ్‌పిహెచ్ఎస్‌లు నిలిచాయి. ఖోఖోలో విన్నర్స్ లోలుగు జెడ్‌పిహెచ్ఎస్, రన్నర్స్ లోలుగు కెజిబివిలు నిలిచాయి. వాలీబాల్‌లో విన్నర్స్ లోలుగు కెజిబివి, రన్నర్స్ తాడివలస జెడ్‌పిహెచ్ఎస్‌లు గెలుపొందాయి. బాడ్మింటన్‌లో విన్నర్స్ లోలుగు కెజిబివి, రన్నర్స్ కింతలి జెడ్‌పిహెచ్ఎస్‌లు

పొందూరు : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

నిలిచాయి. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు, ఎంఎస్ఒ ఉదయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక ఆల్ఫాజెన్ స్కూల్లో రెండు రోజులుగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ మండల స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయని ఎస్‌జిఎఫ్, టెక్కలి డివిజన్, ఇన్‌ఛార్జి బాడాన నారాయణరావు తెలిపారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ముగింపు క్రీడల్లో మండల విద్యాశాఖాధికారులు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, మండల ఎంఎస్ఒ ఎస్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పైపు లీకై వృథాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా

పోలాకి: మండలంలోని అంపలాం పంచాయతీలో రేవుఅంపలాం గ్రామంలో పైపులైన్ లీకై తాగునీరు వథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. శుక్రువారం పైపులైన్ లీకైన దృశ్యాన్ని విలేకరులకు చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా 15 రోజుల నుంచి లీకవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనివలన రేపు అంపలాంలో కొళాయిలు రావడం లేదని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాగుచేయాలని కోరారు.

వీల్ చైర్ పంపిణీ

పలాస: పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రధానమంత్రి మత్య సంపద యోజన పథకం కింద బైపల్లి రామచంద్రరావు అనే లబ్దిదారుడుకు శుక్రవారం వీల్‌చైర్ పంపిణీ చేశారు. ఈ పథకం మత్యకారులకు చేపల రవాణా చేయాలనే ప్రధాన ఉద్దేశ్యమని, దీనివలన ఖర్చు తగ్గుతుందని తెలిపారు. మూడు లక్షల రూపాయలు విలువ చేసే వీల్‌చైర్ ప్రభుత్వం రూ.లక్షా 20 వేలు రాయితీ కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు ఎడిఒ పీరుకట్ల విఠల్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ఇచ్ఛాపురం: బాల్య వివాహ రహిత భారత్ దేశం వంద రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈదుపురంలో సామూహిక ప్రతిజ్ఞ చేశారు. శుక్రవారం ఈదుపురంలో కందర హైస్కూల్‌లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల వివాహ ముక్త భారత్ ప్రచారంలో భారత ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు మద్దతు ఇస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి హంగీర్ బెహరా, అధ్యాపక బృందం తమ్మయ్య, ఉమామహేశ్వరి, ఎన్‌జిఒ స్వాతి, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

టెక్కలి: మండలంలోని తలగాం ఎట్ నౌపడా ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 15 మంది పేద విద్యార్థులకు బిగ్‌హెల్ప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు, అక్టోబర్ నెలకు అవసరమైన స్టేషనరీని పాఠశాల హెచ్ఎం పేడాడ అమ్మనమ్మ చేతులమీదుగా అంద జేసారు. విద్యార్థుల శ్రేయస్సు, విద్యాభివృద్ధి దృష్ట్యా స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రాజెక్టు డైరెక్టర్ బోడ్డేపల్లి విద్యావతి మాట్లాడుతూ అసోసియేషన్ అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ పి. అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు సేవా పథకాలు సక్రమంగా అమలు కావటం లేదని వైసిపి ప్రజా ప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. దీంతో వైసిపి, టిడిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారి అజయ్ కుమార్ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు వివరించారు. సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ ఇటీవల సంభవించిన తుపాను కారణంగా తులసిగాం, దర్మపురం గ్రామాల్లో ఎంత పంట నష్టం జరిగింది, ఎంత శాతం నమోదు చేశారని ఎఒను ప్రశ్నించారు. తులసిగాం, ఇన్నేసుపేట గ్రామాల్లో 96 హెక్టార్లు పంట మాత్రమే నష్టం జరిగిందని తెలిపారు. ఈరెండు గ్రామాల్లో చాలా మంది రైతులు పంట ఈ క్రాప్ నమోదు సక్రమంగా జరగలేదని, అందువల్లే పంట నష్టం నమోదు పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. తుపాను తగ్గిన నాటికి ఈ క్రాప్ నమోదుకు మరో వారం రోజులు గడువు ఉన్నా వ్యవసాయ అధికారులు ఈ క్రాప్ నమోదు చేయలేదని తులసిగాం సర్పంచ్ తులసీరావు ఆరోపించారు. కూటమి నాయకులు చెప్పిన వారి పేర్లు మాత్రమే ఈ క్రాప్ నమోదు చేశారని మిగిలిన వారి పేర్లు నమోదు చేయలేదని ఈదుపురం సర్పంచ్ నర్తు ప్రసాద్ చెప్పటంతో వెంటనే స్పందించిన

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

టిడిపికి చెందిన పిఎసిఎస్ అధ్యక్షులు పెదిని బాబ్జీ మాట్లాడుతూ వైసిపి నాయకుల మాటలు అవాస్తవమని తెలిపారు. దీంతో ఇరు పార్టీల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో పిఎసిఎస్ అధ్యక్షులతో పాటు ఎఎంసి చైర్మన్ మణిచంద్రప్రకాష్ సభనుంచి బయటకు వెళ్లిపోయేందుకు సిద్ధపడుతుండగా బిర్లంగి ఎంపిటిసి దక్కత ఏకాంబరి సర్ది చెప్పటంతో మరలా తిరిగి సభలో కూర్చున్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన నాయకులకు కొంత మేలు జరుగుతుందని, ప్రతపక్ష నాయకులకు కూడా కొన్ని పనులు చేయించుకోవాలని ఒకరికొకరు ఇబ్బందులు కలిగిస్తే రైతులకు, ప్రజలకు నష్టం కలుగుతుందన్నారు. అధికారులు కూడా స్పందించి రైతులకు, ప్రజలకు నష్టం కలగకుండా తమ విధుల ను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సమావేశంలో ఎంపి డిఒ ప్రభాకరరావు, తహశీల్దార్ వెంకటరావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసమే 'రైతన్నా మీకోసం'

ఆమదాలవలస : పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న చంద్రశేఖర్ తదితరులు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని సమస్యాత్మక సాగు నేలలకు అనుకూలంగా అధిక రాబడి నిచ్చే పంటలు, అలాగే సాగు చేస్తున్న పంటల దిగుబడి తగ్గుతున్నందుకు ఉపశమన మార్గాలు విశ్లేషించి పరిష్కారం చెబుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి నరసింహమూర్తి తెలిపారు. మండలంలోని బుషికుద్ద, ఇసకలపన గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా తీర ప్రాంత నేలల్లో వరి, కొబ్బరి రాబడి పెంచేందుకు శాస్త్రవేత్తలతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఆధునిక పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధులు ఈశ్వరరావు, రాజు, వాసుపల్లి రామారావు, కరి లక్ష్మీనారాయణ, పశు వైద్య సహాయకులు హనీషా తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వం రైతన్న సంక్షేమ కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని రైతులు సద్వినియగం చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం అన్నారు. మండలంలో పాయతారు గ్రామ పంచాయతీలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గిన్నె బాలరాజు, ఎఇఒ జీవనజ్యోతి, కుమారి, వలపల తుంబనాధం, బరికో బెహరా, మోహన్ బెహరా, కేశవరావు, వలపల తులసీ, భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: రైతు శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని తొగరాంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నారాయణపురం ఆనకట్టు చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.నిఖిల, రెవెన్యూ ఇంజినీరింగ్, విద్యుత్, మార్కెట్ కమిటీ, పశుసంవర్ధక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టెక్కలిరూరల్: రైతులకు టిడిపి ప్రభుత్వంతోనే మేలు జరుగుతుందని ఎఎంసి చైర్మన్ బగాది శేషగిరిరావు అన్నారు. మండలంలో తిర్లంగిలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.రేణుక, ఎఒ ఎన్,శ్రీనివాసరావు, హనుమంతు రామకృష్ణ, మాజీ సర్పంచ్ దవళ రామచంద్రరావు, మామిడి రాము, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒగా ద్రాక్షాయిని

ద్రాక్షాయిని సంధ్యారాణి

నరసన్నపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒగా పి. ద్రాక్షాయిని నియమించినట్లు ఎంపిడిఒ వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇంతవరకు మేజర్ పంచాయతీ ఇఒగా విధులు నిర్వహించిన ద్రాక్షాయినికి డిప్యూటీ ఎంపిడిఒగా పదోన్నతి పొంది నరసన్నపేట గ్రామ వార్డు సచివాలయ డిప్యూటీ ఎంపిడిఒగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. అలాగే పోలాకి డిప్యూటీ ఎంపిడిఒగా జి.సంధ్యారాణి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారని పోలాకి ఎంపిడిఒ జి. రవికుమార్ తెలిపారు. ఇరువురికి ఎంపిడిఒలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉపాధి సిబ్బందికి బోధనా సామగ్రి అందజేస్తున్న ఎంపిడిఒ

'అక్షరాంధ్ర' విజయవంతం చేయాలి

పొందూరు: నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అక్షరాంధ్ర కార్యక్రమంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31 నాటికి మండలంలో సుమారు 3,800 మంది వయోజనులను అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. అలాగే బోధనపై శిక్షణకు సంబంధించి అభ్యాసకులకు అవసరమైన పుస్తకాలను అందజేశా మన్నారు. ఉపాధి హామీ మేట్లకు లక్ష్యంగా అప్పగించిన 1540 మందికి బోధనలో ఉపయోగించేందుకు కిట్‌ను అందజేశారు. సమావేశంలో ఎపిఒ పైల శ్రీనివాస్, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్కిల్‌హబ్ కేంద్రం ద్వారా జాబ్‌మేళా శనివారం నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, యువకులు అర్హులని తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్‌మేళాకు 18 నుంచి 30 ఏళ్లలోపు యువతీ, యువకులు హాజరు కావచ్చునని, ఆసక్తి గల అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, రెండు ఫోటోలతో హాజరుకావాలన్నారు.

తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు, భానుమతి (ఫైల్)

స్కూటీని ఢీకొన్న లారీ

తల్లి మృతి, కుమారునికి గాయాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస, బూర్జ

పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలోని ఫ్లై ఓవర్ వంతెన దిగువన శుక్రవారం స్కూటీని లారీ ఢీకొన్న సంఘటనలో తల్లి మృతి చెందగా కుమారునికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు బూర్జ మండలం కొల్లివలస గ్రామానికి చెందిన నున్నగొప్పల మణికంఠ తన తల్లి భానుమతితో కలిసి స్కూటీపై కొల్లివలస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న సమయంలో ఫ్లై ఓవర్ దిగువకు చేరుకునే సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి పాలకొండ వైపు కొబ్బరికాయల లోడుతో వెళ్తున్న లారీ ఓవర్‌టెక్ చేసే సమయంలో స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భానుమతి (50) అక్కడికక్కడే మృతి చెందగా కుమారుడు మణికంఠ తీవ్ర గాయాల పాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఆమదాలవలస పోలీసులు అక్కడ చేరుకొని విచారణ చేయగా ప్రమాదం జరిగిన స్థలం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందడంతో వెంటనే శ్రీకాకుళం పోలీసులకు సమాచారం అందించగా అక్కడకు చేరుకున్న రూరల్ పోలీసులు మృతి చెందిన భానుమతిని పోస్టుమార్టం నిమిత్తం, మణికంఠను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొల్లివలసలో విషాదం

బూర్జ మండలం కొల్లివలస గ్రామానికి చెందిన భానుమతి మృతి చెందడంతో కొల్లివలసలో విషాదఛాయలు అలుముకున్నాయి. వైద్యం కోసం తల్లి, కుమారుడు స్కూటీపై వెళ్లి వైద్యం చేయించుకుని ఇంటికి వస్తారని అనుకున్నామని, అయితే మృత్యువు లారీ రూపంలో భానుమతిని కబలించిందని గ్రామస్తులు వాపోయారు. అందరితో కలిసిమెలిసి ఉండే భానుమతి మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మృతి చెందిన పంచారాం

రోడ్డు ప్రమాదంలో పాదచారి మృతి

కవిటి: మండలం ఆర్. కరపాడు టోల్‌గేట్ నందు విషాదం చోటుచేసుకుంది. టోల్ గేట్ సమీపంలో ఉన్న రాజస్థాన్ డాబాలో వంట మనిషిగా పనిచేస్తున్న పంచారాం (28) (స్వస్థలం రాజస్థాన్) జాతీయ రహదారి-16 పై బుధవారం అర్ధరాత్రి ప్రమాదానికి గురై మృతి చెందాడు. శిలగాం వైపు నుంచి తప్పుడు దిశలో వస్తున్న వాహనం నడుచుకుంటూ వస్తున్న పంచారాంను నిర్లక్ష్యంగా ఢీకొట్టింది. తీవ్రమైన గాయాలపాలైన ఆయనను 108 అంబులెన్స్‌లో ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే సమయంలో మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై ఎస్ఐ వి.రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

పాము కాటుకు రైతు మృతి

నందిగాం: మండలం బడగం గ్రామానికి చెందిన రైతు బమ్మిడి వైకుంఠరావు (49) పాముకాటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే ఈ నెల 22న తన పొలం పనులు చేసుకుంటూ ఉండగా పాముకాటుకు గురై అస్వస్థత చెందాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం రిఫరల్ చేశారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడు పేద రైతు కావడంతో గ్రామస్తులు రూ.లక్ష వైద్య ఖర్చు లకు అందించారు. అయినా మృత్యువు ఆయనను కబలిం చింది. మృతునికి భార్య, వివాహిత కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నందిగాం: మండలం లట్టిగాం వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే భామిని మండలం

భామినికి చెందిన బొమ్మాలి సుదర్శనరావు తన అత్తవారి ఊరైన హరిదాసు పురం వెళ్లేందుకు లట్టిగాం వద్ద బస్సు దిగి హరిదాసుపురం వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పలాస వైపు నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కోటబొమ్మాళికి చెందిన ఎల్.శ్రీనివాసరావు, సంధ్య, పావనీ ద్విచక్ర వాహనంపై వస్తూ బలంగా ఢీకొట్టడంతో సుదర్శనరావుకు తీవ్ర గాయాలుకాగా 108 టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అలాగే శ్రీనివాసరావు, సంధ్య, పావనీలకు గాయాలతో టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

రణస్థలం: జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వల్లభరావుపేట గ్రామంలో మీసాల రమణమ్మ ఇంట్లో ఇంటి పక్కనే నివాసం ఉంటున్న బోంతు రామకృష్ణ అనే వ్యక్తి ఈ నెల 15న మూడు తులాల బంగారం చైను దొంగలించి విజయవాడ వెళ్లిపోయారు. అయితే క్రైం పోలీసులు ఫోన్ ట్యాపింగ్ ద్వారా కనుక్కోని విజయవాడ వెళ్లి అరెస్ట్ చేసి తీసుకుని వచ్చి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. అలాగే మూడు తులాల బంగారం చైను కూడా రికవరీ చేసినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

ఆటో డ్రైవర్‌కు 7 రోజుల జైలు శిక్ష

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఔట్ గేట్ వద్ద గురువారం వన్‌వే రోడ్డులోకి ప్రవేశించిన ఆటోను డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ బి.మురళీకృష్ణ ఆపేందుకు ప్రయత్నించిన సమయంలో, ఆటో డ్రైవర్ వేగంగా ముందుకు నడిపినట్లు ట్రాఫిక్ సిఐ రామారావు తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి ప్రమాదం కలిగే విధంగా ప్రవర్తించాడని తెలిపారు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, శ్రీకాకుళం నగరం కృష్ణాపార్కుకు చెందిన ఆటో డ్రైవర్ ఎన్ని శ్రీనివాసరావును కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. నిందితుడి నిర్లక్ష్య, ప్రమాదకర డ్రైవింగ్ చర్యలపై 7 రోజుల జైలు శిక్ష న్యాయమూర్తి విధించినట్లు తెలిపారు.

వ్యభిచారం కేసు నమోదు

శ్రీకాకుళం సిటీ: స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో ఒక ప్రైవేట్ లాడ్జిలో టూటౌన్ సిఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం దాడులు చేపట్టింది. వ్యభిచారం చేస్తుండగా పట్టుకున్నారు. నిర్వాహకులతో పాటు నలుగురిపై కేసు నమోదు చేశారు.

దాడుల్లో పట్టుబడిన కల్తీ మద్యం సీసాలు

కల్తీ మద్యం షాపుపై కేసు నమోదు

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని పిఆర్ వైన్ షాప్‌పై శుక్రవారం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పల్లి మురళీధర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు ఆమదాలవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అసిస్టెంట్ కమీషనర్ (ఎన్ఫోర్స్మెంట్) ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు బృందం ఆకస్మికంగా పిఆర్ వైన్ షాప్‌పై దాడులు జరిపింది. ఈ దాడుల్లో పిఆర్ వైన్స్‌లో నీళ్ల కలిపిన కల్తీ మద్యం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 10.88 లీటర్ల కల్తీ మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఒక లీటర్ పరిమాణం గల 9 వాటర్ బాటిల్స్‌లో కల్తీ మద్యం అలాగే 11 నిప్పు బాటిల్స్‌లో నీళ్ల కలిపిన మద్యంను గుర్తించినట్లు తెలిపారు. ఈ దాడుల సమయంలో షాప్‌లో విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు, శ్రీనివాసరావులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సతీష్ కుమార్ తెలిపారు. పట్టుబడిన కల్తీ మద్యం బాటిళ్లు, అరెస్టయిన ఇద్దరు వ్యక్తులను ఆమదాలవలస ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిని కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం వారిని జ్యూడిషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది రమణ, విజయ్, వెంకటేష్, గాలిబ్ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ లక్ష్మణరావు

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- మందస
మండలంలోని లింబిగాం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ ఎం.లక్ష్మణరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో అన్ని తరగతుల్లో గల విద్యార్థుల సామర్థ్యాలు, ప్రగతిని పరిశీలించి తగు సూచనలు చేశారు. 4, 5 తరగతుల విద్యార్థులకు గణితంలో చతుర్విధ ప్రక్రియలను పరిశీలించి సులువైన పద్ధతిలో ఎలా బోధించాలో విధానం తెలియజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. డిసెంబర్ 5న మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని, అదే రోజు ప్రోగ్రెస్ కార్డు ఇవ్వాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానం ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం భోజనం ప్రభుత్వ మెనూ ప్రకారం అందుతుందా లేదా అని పరిశీలించారు. ఈయనతో హెచ్ఎం మాధ్య జగన్మోహనరావు, గున్న రాజు, తాతారావు, దున్న మన్మధరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలమటను కలిసిన జనసేన మండల నాయకులు

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి
స్థానిక ఎన్నికలకు కూటమిలో జన సైనికులు సిద్ధమవ్వాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ దిశానిర్దేశం చేశారు. శుక్రవారం కొత్తూరులోని ఆయన స్వగృహంలో మండలంలోని జనసేన నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఎన్నికలు మరెన్నో రోజులు లేవని, క్షేత్రస్థాయిలో కూటమిని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలన్నారు. కూటమి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం ఇటీవల జనసేనలో చేరిన వసంధర సర్పంచ్ సలాన అప్పలనాయుడు ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు దుక్క బాలరాజు, పాతపట్నం ఎఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, లక్ష్మీపురం కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మృతురాలి తండ్రికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావు, జెడ్‌పి చైర్‌పర్సన్

మృతురాలి కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి- కంచిలి
పలాస శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఇటీవల జరిగిన తొక్కిసలాటలో ఒడిశా, గంజాం జిల్లా, గుడ్డి భద్ర గ్రామానికి చెందిన రంగాల రూప మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఘటనలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ తరుపున రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే నర్తు రామారావు, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం అందించారు. కార్యక్రమంలో ఇప్పిలి కృష్ణారావు, కారింగి పుష్ప, నర్తు నరేంద్ర, రత్నాల సారథి చౌదరి, మునకల వీరా స్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి- నరసన్నపేట
పట్టణంలోని సెయింట్ క్లారెట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న మెరుగు పరమిత శ్రీ తెలుగు ప్రతిభా పరీక్షల్, రాష్ట్రస్థాయి ప్రథమ స్థానాన్ని నీలాద్రి ప్రియ హిందీలో జిల్లాలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ బాల కుమార్ తెలిపారు. మన సంస్కృతి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిభా పరీక్షల్లో తమ విద్యార్థులు కనబరిచి రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను పాఠశాలలో అభినందించారు.

శ్మశాన వాటికను పరిశీలిస్తున్న కమిషనర్ తదితరులు

శ్మశానవాటిక పరిశీలన

ప్రజాశక్తి- పలాస
స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, చైర్‌పర్సన్ బల్ల గిరిబాబు ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తమ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కాశీబుగ్గ శ్మశాన వాటికను పరిశీలించారు. ఈ తనిఖీలో భాగంగా శ్మశాన వాటికలో అధికంగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను జెసిబి సహాయంతో జంగిల్ క్లియరెన్స్ చేయించడం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ కనకరాజు, మున్సిపల్ ఇంజినీరు కిరణ్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ

టెక్కలి: టెక్కలి బి.ఎస్.జె.ఆర్. జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న బొడ్డ గణేష్ 800 మీటర్ల రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ కోత శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో ఈ నెల 24, 25, తేదీల్లో జరిగిన పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. డిసెంబర్ 13న లక్నోలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన గణేష్‌ను, కోచ్ బసవల బాబూరావును అభినందించారు. అభినందించిన వారిలో అధ్యాపకులు ఎ.బ్రహ్మానందం, కృష్ణారావు, అప్పన్న, జనార్ధనరావు, ప్రదీప్ తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి
మండలంలోని గోకర్ణపురం మాజీ సర్పంచ్ దువ్వల హరికృష్ణ ఇటీవల మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి మాజీ అధ్యక్షులు ఉల్లాన బాలరాజు, గొప్పిలి సర్పంచ్ ప్రతినిధి పల్లి యోగి, ముక్కాపురం సర్పంచ్ అలికాన మాధవరావు, మాజీ ట్రైకర్ డైరెక్టర్ సవర సుభాష్ తదితరులున్నారు.

హరికృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న శాంతి

అభ్యుదయవాది జ్యోతిరావు పూలే

ప్రజాశక్తి- ఎచ్చెర్ల
సామాజిక సంఘ సంస్కర్త, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే సందర్భంగా డా. బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలో ఆయన చిత్రపటానికి నివాళ్లర్పించారు. దేశానికి జ్యోతిబా చేసిన సేవలు, త్యాగాలను కొనియాడారు. ఈ సందర్భంగా వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని మాట్లాడుతూ రెండు శతాబ్ధాల క్రితమే స్త్రీ విద్యకు ప్రాధాన్యత ఇస్తూ బాలికల పాఠశాలను స్థాపించిన గొప్ప అభ్యుదయవాది, సామాజిక తాత్వికవేత్త పూలే అని అభిప్రాయపడ్డారు. తన సతీమణి సావిత్రిబాయ్ పూలేతో కలిసి కులవివక్షత, సంఘ అసమానతులకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమస్ఫూర్తి జ్యోతిబా అని కొనియాడారు. వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ప్రిన్సిపాళ్లు డా. సిహెచ్. రాజశేఖరరావు, డా. కె.స్వప్న వాహిని, ఎస్ఓ. కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: విజయవాడలో బిసి భవన్‌లో శుక్రవారం జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బిసి కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి. ఉమాదేవి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మాట్లాడుతున్న విసి రజని

పోలాకి : జ్యోతిరావు పూలే మహనీయుడని, ఆయన సేవలు మరువలేనివని జాతీయ బిసి వెల్ఫేర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి నల్లాన వెంకట కృష్ణ గిరిధర్ అన్నారు. అంపలాంలో పూలె వర్ధంతి నిర్వహించి చిత్రపటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

రణస్థలం: జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి నాయకులు, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.ఈశ్వరావు, ఎంఇఒ ఎ.త్రినాథరావు, వైసిపి సీనియర్ నాయకులు మహంతి సత్యం, సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీలో ఎమ్మెల్యేగా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- బూర్జ
భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకోనీ 26న రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ఎమ్మెల్యేగా ఓవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కొనపల సాయిదీక్షిత్ ప్రతిభ కనబరిచాడు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, వారి నైపుణ్యాలను పదును పెట్టి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు మాక్ అసెంబ్లీ కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు అన్నారు. అసెంబ్లీలో ప్రతిభ కనబర్చి అందరి మన్ననలు పొందిన సాయిదీక్షిత్‌ను ఆమదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్, తల్లిదండ్రులు శైలజ, దాలిస్వామితో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

టెక్కలి: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాక్ అసెంబ్లీలో పాల్గొన్న టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని ఆర్.రేష్మికను హెచ్ఎం ఎన్.శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా మాక్ అసెంబ్లీలో రేష్మిక ఎమ్మెల్యే పాత్ర పోషించింది. ఐఎఎస్ చదవాలన్న తన కోరిక శాసనసభను చూసిన తర్వాత మారిందని రాజకీయాల్లోకి రావాలని ఉందని రేష్మిక తెలిపారు. విద్యార్థిని రేష్మిక, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు నంబాళ్ల వాణిశ్రీ, ఎ.రమాదేవీ, స్వాతిలను పలువురు అభినందించారు.

టెక్కలి : విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో రేష్మిక

కోతులు, పశువుల నివారణకు చర్యలు తీసుకోరా..?

అధికార యంత్రాంగాన్ని నిలదీసిన వైస్ చైర్మన్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
మున్సిపాలిటీలో ఉన్న 23 వార్డుల్లో విచ్చలవిడిగా పెరిగిన కుక్కలు, కోతులు నివారణకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వైస్ చైర్‌పర్సన్‌లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి అధికారులను నిలదీశారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన కౌన్సెల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరచూ కుక్కలు, కోతులు దాడిలో అనేక మంది గాయాల పాలవుతున్నారని, ప్రజా ప్రతినిధులు ఈ సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం చాలా దారుణమన్నారు. పాత బస్టాండ్ జంక్షన్ ఎర్రన్న కూడలి వద్ద ఏర్పడ్డ ప్రమాదకర గోతులను ఎప్పుడు పూడుస్తారని, గోతులు ఏర్పడటం వలన ప్రతీ రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని టిడిపి కౌన్సిలర్ ఆశీ లీలారాణి అధికారులను నిలదీశారు. స్పందించిన చైర్‌పర్సన్ ఇదివరకే గోతులు పూడ్చాలని ఆర్‌అండ్‌బి అధికారులకు సమాచారం ఇవ్వటం జరిగిందని, అధికారులు స్పందించటం లేదని మరోసారి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎజెండాలో పొందుపర్చిన ఆరు అంశాలపై చర్చ జరగ్గా అన్ని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ఆన్‌లైన్‌లోనే ఇంటిపన్ను వసూళ్లు

పరిశీలిస్తున్న ఐ.వి రమణ

ప్రజాశక్తి- కవిటి
ఇకపై ఆన్‌లైన్‌లోనే ఇంటిపన్ను వసూళ్లు చేయాలని డివిజనల్ లెవెల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ స్పష్టం చేశారు. శుక్రవారం కవిటి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ఇంటిపన్ను వసూళ్లపై సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ముఖ్య ఆదాయవనరైన ఇంటిపన్ను ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్ పద్ధతిలోనే జరగాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆఫ్‌లైన్ విధానం పూర్తిగా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఇఒ ముఖి రవి, జూనియర్ అసిస్టెంట్, బిల్లు కలెక్టర్ సాయి తేజ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జామియా మసీదు జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి- అరసవల్లి
నగరంలో ఉన్న జామియా మసీదులో 18 ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్లు జామియా మసీద్ నూతన కమిటీ అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, కార్యదర్శి ఎండి హాసిన్ తెలిపారు. ఈ జంగిల్ క్లియరెన్స్‌కు ఎమ్మెల్యే గొండు శంకర్ సహకారం కూడా ఉందని తెలిపారు. జామియా మసీదులో ఉన్న శ్మశాన వాటిక ప్రాంతాన్ని కూడా శుభ్రం చేయడం, పాదచారులు వెళ్లే రహదారిలో మట్టి వేసి బాగుచేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జామియా మసీదు నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, కమిటీ నూతన అధ్యక్షులుగా షేక్ నిజాముద్దీన్, కార్యదర్శిగా ఎండి యాసిన్, కోశాధికారిగా మీరు అసదుల్లా, అబ్దుల్ గ్రాఫర్, చాంద్ బాషా, ఖాన్, షేక్ సలీం, ఎండి రఫీ, మహమ్మద్ జహంగీర్ తదితరులను సభ్యులుగా ఎన్నుకున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఎన్నికైన కమిటీ సభ్యులు

మొగిలిపాడులో రచ్చబండ

సంతకాల సేకరణ చేపడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- మందస
కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 16 నెలల పరిపాలన వైఫల్యాలపై మందస మండలం మొగిలిపాడులో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైసిపి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడ్డాక స్కామ్‌లు లేని స్కీము ఒక్కటి కూడా లేదని, అంతా హడావుడి తప్ప పరిపాలనపై చిత్త శుద్ధి లేదన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పొందూరు: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు కళాశాలలుగా మార్చేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న పిపిపి విధానాన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. తండ్యాం, పొందూరులో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, నాయకులు కిల్లాన సూర్యారావు, చింతాడ సత్య ప్రసాద్, మజ్జి గోపాలకృష్ణ, బొడ్డేపల్లి పద్మజ, గాడు నాగరాజు, అనకాపల్లి గోవిందరావు, గుడ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పొందూరు: సైబర్ నేరాలపై ప్రతీఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నారీ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధానికి 1098, సైబర్ క్రైమ్‌కు 1930, పోలీస్ ఎమర్జెన్సీకి 112 వంటి టోల్‌ఫ్రీ నెంబర్లుపై అవగాహనను కలిగి ఉండాలని తెలిపారు. అలాగే పాఠశాలలో వేధింపులు, ఆకతాయిల బెడద ఉంటే వెంటనే తమకు సమాచారం అందించాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.గొల్లవాడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


లావేరు : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అప్పలసూరి

లావేరు: యువత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కొండపల్లి అప్పలసూరి అన్నారు. మండలంలోని గుర్రలాపాళెంలో నారీ శక్తి సంకల్పం కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది, గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి- ఆమదాలవలస
ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిఎం చంద్రబాబు నాయుడు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ప్రజాదర్బార్ ద్వారా అందించే ప్రతి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని చంద్రశేఖర్, పొట్నూర్ రమేష్, నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి, టిడిపి నాయకులు సంపదరావు మురళి, నాగళ్ల మురళీధర్ యాదవ్, ఎం.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పలాస : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. దాసగోర పాఠశాల సమస్యలపై హెచ్ఎం నవర జగన్నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి మండల అధ్యక్షులు సవర సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పోలాకి : మండలం కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను, పలు శాఖలకు సంబంధించిన అభ్యర్థనలను ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్
ఈ నెల 24, 25 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఎస్‌జిఎఫ్ అథ్లెటిక్స్ క్రీడలో 17 ఏళ్ళ విభాగంలో పొన్నాడ హర్షవర్ధన్ లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్, 100, 200 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్‌ను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ మెట్ట మోహనరావు శుక్రవారం తెలిపారు. డిసెంబర్ 13 నుంచి లక్నోలో జరిగే జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైనట్టు కోచ్ బసవల బాబూరావు తెలిపారు. ఈ విజయంపై ఎస్‌విఆర్‌కె జూనియర్ కళాశాల కరస్పాండెంట్ అన్నెపు ఉమామహేశ్వరరావు, డైరక్టర్ కొసంటి శ్రీనివాసరావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

టెక్కలి రూరల్ : విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

వజ్రపుకొత్తూరు : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు: మచిలీపట్నంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-14, కబడ్డీ పోటీల్లో నగరంపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి ఎన్. రాజకమల్, తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.హారిక ద్వితీయ స్థానం సాధించారు. వీరికి శిక్షకులుగా వ్యాయామ ఉపాధ్యాయులు పి.గజేంద్రరావు, జె.నారాయణరావు వ్యవహరించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం తలగాన హేమరావు, పిఎంసి చైర్మన్ బి.లక్ష్మిపతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలి

మెళియాపుట్టి : ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీనుపై జరిగిన దాడిని, ఆదివాసీ సేన రాష్ట్ర, ఆదివాసీ (గిరిజన) చైతన్య వేదిక సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో క్వారీ విషయమై గత కొంతకాలంగా వివాదం నెలకొని ఉందని, అట్టి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటివరకు అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోవడం దారుణమని, దీనిని ఆసరాగా చేసుకున్న గుత్తేదారులు అక్రమాలను ప్రశ్నిస్తున్న ఆదివాసి నాయకునిపై దాడికి ప్లాన్ చేసి ఆదివాసీలనే దాడి చేయించే విధంగా చేసి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారన్నారు. ఆదివాసి (గిరిజన) చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు సవర చొక్కారావు మాట్లాడుతూ ఐదవ, అరవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఉన్న ఆదివాసి చట్టాలను అధికారులే తుంగలో తొక్కి చర్యలు తీసుకోకుండా ఉండడం వల్లే నేడు ఆ గ్రామంలో గొడవలు సృష్టించబడుతున్నాయని, తక్షణమే అధికారులు స్పందించి క్వారీ అక్రమాల విషయంపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్య పరిష్కరించాల్సిన అధికారుల ఉదాసీన వైఖరి వలనే సమస్యలు వస్తున్నాయని, వెంటనే దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, తిరుపతిరావు, జన్ని కూర్మారావు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైతన్య వేదిక సంఘం నాయకులు

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- సోంపేట
సోంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 30న ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. 33/11 కెవి సోంపేట సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కెవి సోంపేట టౌన్ ఫీడర్, 11 కెవి బీరుసువాడ ఫీడర్ పరిధిలో సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. సోంపేట సబ్‌స్టేషన్‌లో ఆర్‌డిఎస్ఎస్ వర్క్ జరుగుతున్న కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. 33/11 సోంపేట సబ్‌స్టేషన్ మండలంలోని సోంపేట, జింకిభద్ర, బెంకిలి తదితర గ్రామాలకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస
కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎఐసిసి పరిశీలకులు అఖిలభారత కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ సూరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' (సంస్థాగత నిర్మాణ కార్యక్రమం) కార్యక్రమాన్ని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిసిసి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం సంస్థాగత నిర్మాణం నియోజకవర్గ స్థాయి కమిటీలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నియామకంపై కార్యకర్తలు, నాయకుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. యువజన విభాగం, సేవాదళం, మహిళా కాంగ్రెస్, రైతు విభాగం, పట్టణ, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పిసిసి పరిశీలకులు లక్కరాజు రామారావు, పిసిసి కార్యదర్శి పి. శాంత కుమారి, జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాధరావు, మాజీ డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, మాజీ ఎంపిపి బొడ్డేపల్లి గోవింద గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ జనార్ధనరావు బాధ్యతలు చేపట్టిన తర్వాత వైసిపి మండల నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. శాంతి భద్రత పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, వైసిపి నాయకులు కె.మోహనరావు, వైసిపి మండల అధ్యక్షుడు పి.రాజశేఖర్ రెడ్డి, నర్తు వరప్రసాద్, ఆ సీ.పురుషోత్తం రెడ్డి, ఆసీ కృష్ణారెడ్డి, కారింగ త్రినాథ్, తులసిరాం, దక్కత నూకయ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి సిక్కోలు హరిత మహోత్సవం

ప్రజాశక్తి - అరసవల్లి
వచ్చేనెల 9 నుంచి మూడురోజుల పాటు సిక్కోలు హరిత మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కమిటీ అధ్యక్షులు దార్లపూడి రవి ఒక ప్రకటనలో తెలిపారు. 80 అడుగుల రోడ్డులో ఉన్న బృందావనం ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడురోజులు ఫ్రెష్ ప్రొడ్యూస్, గృహోపకరణాల వస్తువులు, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, హ్యాండ్లూమ్స్, పొందూరు ఖాది, ప్రకృతి సిద్ధమైన ప్రొడక్ట్స్, నర్సరీ స్టాల్స్, దేశీయ విత్తనాలు, ఆవకాయ పచ్చళ్లు, అప్పడాలు అమ్మకాలు జరుగుతాయని, అదేవిధంగా పర్యావరణహిత జీవన విధా నంపై ఆర్ట్ గ్యాలరీ, మిల్లెట్ ఫుడ్ పోటీలు, బోన్సాయ్ మొక్కల పోటీలు, సాంస్కృత కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ మహోత్సవంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్, రెడ్‌క్రాస్, నైరా అగ్రికల్చర్ కాలేజీ, మెప్మా, ఉద్యానవన శాఖలు, శ్రీకాకుళం సన్రైజర్స్ సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టాల్స్ కొరకు 8639456848, 9490566555, 8341012126 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - నందిగాం
మండలంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించ బడునని, ఈ సమావేశానికి సభ్యులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపిడిఒ కుమార్ పట్నాయక్ ఒక ప్రకటనలో కోరారు.

మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం రుణాలు

ప్రజాశక్తి - మందస
మహిళా సంఘాల పనితీరు ఆధారంగా పంచసూత్రాలను పరిగణలోనికి తీసుకుంటూ ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల ప్రాప్తికి మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు రుణాలను మంజూరు చేస్తున్నట్లు వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం సిరిపురం, పొత్తంగి గ్రామాల్లో మహిళా సంఘాల పనితీరు, పుస్తక నిర్వహణ పరిశీలించి సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ రమేష్‌తో పాటు విఒఎలు జయలక్ష్మి, భారతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కూర్మారావు